క్లుప్తంగా

వర్షాలకు నేలకూలిన చెట్లు


చెట్లను తొలగిస్తున్న అగ్రోఫారెస్ట్ సిబ్బంది

ఉక్కునగరం: అల్ప పీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కూర్మన్న పాలెం నుంచి స్టీల్‌ప్లాంట్ వెళ్లే రహదారి, టౌన్‌షిప్‌లోని పలు సెక్టార్లలో చెట్లు పడిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో సోమవారం ప్రజా రవాణాకు అంతరాయం కలిగింది. చెట్లు రోడ్డుకు అడ్డంగా పడడంతో బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని అగ్రోఫారెస్ట్ విభాగానికి సమాచారం అందించారు. హోంగార్డుల సాయంతో నేల కూలిన చెట్లను తొలగించారు. సాయంత్రం తర్వాత వాహనాల రాకపోకలు యధావిధిగా సాగాయి.

వినాయక ఉత్సవాలకు అంకురార్పణ


పందిరిరాట ఉత్సవం నిర్వహిస్తున్న జాబిలీహిల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: వినాయక ఉత్సవాలు పురస్కరించుకొని జీవీఎంసీ 79వ వార్డు శనివాడ జాబిలీహిల్స్ కాలనీలో సోమవారం పందిరి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదిపండితులు మంత్రోచ్ఛరణల మధ్య కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో రాట వేశారు. జోరు వాన కురుస్తుండగా కాలనీవాసులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు.

వృద్ధుడి ఆచూకీ లభ్యం


సుబ్రహ్మణ్యంతో పోలీసులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో అదృశ్యమైన వృద్ధుడు లభ్యమయ్యాడు. గంగవరం పోర్టులో పనిచేస్తున్న సునీల్ తండ్రి సుబ్రహ్మణ్యం (76) శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరలేదు. దీంతో వారు ఆదివారం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బయటకు వెళ్లిన సుబ్రహ్మణ్యం సెక్టార్–1 కాంప్లెక్స్ పై అంతస్తులో ఉండిపోయారు. అతన్ని చూసిన కొందరు ఎవరో వ్యక్తి రెండు రోజులుగా అక్కడ ఉన్నారని కుటుంబీకులకు తెలిపారు.. వారు వచ్చి చూసి సుబ్రహ్మణ్యంగా గుర్తించి ఇంటికి తీసుకువెళ్లారు. విషయాన్ని స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో తెలిపారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ


రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా

అగనంపూడి: ఈశ్వరీయ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ అగనంపూడి దివ్యజ్యోతి భవనంలో ఈనెల 23న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అగనంపూడి బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి బీకే రామకోటి మాట్లాడుతూ రాజయోగిని ప్రకాష్ మణి దాదీజీ స్మృతి దినోత్సవాన్ని పురస్కరించుకొని 23న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, వి.రాము, నరసింహమూర్తి, బీకే రాజు పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మల్కాపురం: బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ విశాఖ పశ్చిమ ఇన్‌చార్జి అతుకుమిల్లి రామచంద్ర రావు డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు పీజీఆర్ఎస్‌లో సోమవారం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

గణనాథులు సిద్ధం


దుర్గమ్మ ఒడిలో బాల గణపతి


గణపతి ప్రతిమలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు


పూజలకు సిద్ధం చేసిన గణనాథులు

- వీధుల్లో వెలుస్తున్న మండపాలు
- వినాయక ఉత్సవాల ఏర్పాట్లలో కమిటీలు నిమగ్నం

పెదగంట్యాడ: వినాయక చవితి వచ్చేస్తోంది. తొలి పూజలు అందుకునేందుకు గణ నాథులు సిద్ధమవుతున్నారు. గణపయ్యను కొలిచేందుకు.. మనసారా పూజాది కార్యక్రమాలు చేయాలనే సంకల్పంతో.. ప్రతి ఇంటా.. వీధివీధినా ఉత్సవాలు చేసేందుకు ఆయా కమిటీలు కూడా సిద్ధమయ్యాయి..

వివిధ ఆకృతులు.. ఆకర్షణీయ రంగులతో..
వినాయక చవితి ఉత్సవాలకు బొజ్జ గణపయ్యను వివిధ ఆకృతులతో రూపుదిద్దుతున్నారు. ఆయా ప్రతిమలకు ఆకర్షణీయమైన రంగులు అద్దుతున్నారు. ఇప్పటికే ఉత్సవ కమిటీలు ఇచ్చిన ఆర్డర్లు మేరకు ప్రతిమలను సిద్ధం చేయగా.. ఇంకా ఇంటింటా నిర్వహించే పూజా కార్యక్రమాల కోసం చిన్న చిన్న ప్రతిమలను ఆకట్టుకునే విధంగా తయారు చేస్తున్నారు.

మండలంలో ఇలా..
ఉత్సవాల కోసం ప్రధాన కూడళ్లలో ఇప్పటికే పందిరి రాట వేసిన ఉత్సవ కమిటీలు ఇప్పుడు పెద్ద పెద్ద పందిళ్లు... వివిధ రకాల సెట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, సమతానగర్, దయాల్‌నగర్ ప్రాంతాల్లో వినాయకుడి ప్రతిమలను తయారు చేయడంలో కళాకారులు తలమునకలై ఉన్నారు. రాత్రీ పగలూ తేడా లేకుండా పని చేస్తున్నారు. చవితి సమీపిస్తుండడంతో నిద్రాహారాలు లెక్క చేయకుండా పెద్ద ఎత్తున బొమ్మలు తయారు చేస్తున్నారు.

రూ.4 వేల నుంచి రూ.లక్ష వరకూ..
ఇక్కడ తయారు చేస్తున్న ప్రతిమలు రూ.4 వేల నుంచి రూ.లక్ష వరకూ ఉన్నాయి. చిన్న ప్రతిమలు మూడు వేలకు, పెద్ద పెద్ద ప్రతిమలను రూ. 30 వేల నుంచి లక్ష రూపాయల వరకూ తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్సవ కమిటీల ప్రతినిధులు వారికి కావాల్సిన ప్రతిమలను తయారు చేయించుకొన్నారు. ఆయా ప్రతిమలపై వారి ఆర్డర్ నెంబర్లు వేయించుకుంటున్నారు.

ఆర్డర్ ప్రకారం తయారీ..
కొంతమంది తమకు కావాల్సిన ఆకృతుల ప్రకారం బొమ్మలు తయారు చేయాలని తయారీదారులకు ఆర్డర్లు ఇచ్చి మరీ చేయించుకున్నారు. రూపం ఎలా ఉండాలి.. ఏయే రంగులు వేయాలో వారే నిర్ణయిస్తున్నారు. దాని ప్రకారం వాటిని తయారు చేయించుకున్నారు.

విభిన్న రూపాలు..
గజ ముఖుని ప్రతిమలు విభిన్న రూపాల్లో తయారు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. సింహాసనం మీద కూర్చున్నట్టు. పార్వతీ పరమేశ్వరుల మధ్యలో ఉన్నట్టు .సుబ్రహ్మణ్యం స్వామి అవతారంలో. కాణిపాకం వినాయకుడిలా. ఎక్కువ చేతులతో.. నెలవంకపై పడుకున్నట్టు.. శ్రీకృష్ణుని అవతారంలో.. వెంకటేశ్వరస్వామి రూపంలో.. త్రిముఖం.. పంచముఖాలతో రూపుదిద్దుతూ ఆకట్టుకుంటున్నారు.


పక్షిపై నుంచి వెళ్తూ. ..


పరమశివుడి అవతారంలో..

మట్టి బొమ్మలకు డిమాండ్

మట్టి గణపతుల ప్రతిమలకు ఆదరణ ఎక్కువగా ఉంది. వినాయక చవితికి రెండు నెలల ముందు నుంచే ఆర్డర్లు ఇచ్చారు. మా దగ్గర రూ.5 వేల నుంచి రూ.ఒక లక్ష వరకూ బొమ్మలు ఉన్నాయి. ఆర్డర్ల ప్రకారం.. కమిటీల సూచించిన మేరకు ప్రత్యేకంగా గణపతిని తీర్చిదిద్ది అందిస్తున్నాం. ఈ ఏడాది మట్టి బొమ్మలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. గాజువాక నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన కమిటీ ప్రతినిధులు ముందుగా ఆర్డర్లు ఇచ్చి వారికి కావాల్సిన రూపాలను తయారు చేయించుకుంటున్నారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కుతోంది. కోల్‌కతా నుంచి వచ్చి ఇక్కడ బొమ్మలు తయారు చేస్తున్నాం.

–ఉజ్వల్–కళాకారుడు– కోల్‌కతా

ర్యాగింగ్‌తో జీవితం నాశనం


సీఐ వెంకటరావును సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి: ర్యాగింగ్ వల్ల జీవితాలు తలకిందులవుతాయని, విద్యార్థులు ర్యాగింగ్ జోలికి పోవద్దని దువ్వాడ ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు అన్నారు. విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం యాంటీ ర్యాగింగ్, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన వారోత్సావాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ లేకుండా చేయాలని భావిస్తే ర్యాగింగ్ ఫ్రీ జోన్‌గా తీర్చిదిద్దడం సులభమన్నారు. ప్రతీ ఒక్కరూ ర్యాగింగ్‌కు దూరంగా ఉంటానని ప్రతిజ్ఞ చేసుకోవాలన్నారు. హెల్మెట్ , డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ యూజీసీ నిబంధనల మేరకు ర్యాగింగ్‌కు పాల్పడేవారిని ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో డీన్ (పరిపాలన) హరిగోవిందరావు, యాంటీ ర్యాగింగ్ సెల్ ఇన్‌చార్జి మదన్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ


పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న డాక్టర్ గోపీకృష్ణ తదితరులు

అగనంపూడి: గాజువాక మున్సిపల్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దివంగత వి.వి.ఎస్.ఎం.రాజా 59వ జయంతి సందర్భంగా సోమవారం రాజా మిత్ర మండలి ప్రతినిధులు అగనంపూడి ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ పాల్గొని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజా మిత్ర మండలి ప్రతినిధులు వాడపల్లి రామచంద్రరాజు, దంతులూరి సుబ్బరాజు, కిరణ్ వర్మ, చక్రవర్తి పాల్గొన్నారు.

పరిశ్రమల కాలుష్యంతో సతమతం

పెదగంట్యాడ: పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో గాజువాక, మింది, అక్కిరెడ్డిపాలెం ప్రాంతవాసులు సతమతమవుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు గుడివాడ లతీష్, పంచవటి టౌన్‌షిప్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రమాదకర వ్యర్థాల కారణంగా ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ నివాస ప్రాంతాలకు 200 మీటర్ల దూరంలో ప్రమాదకర వ్యర్థాల నిల్వ కోసం గొడౌన్లకు అనుమతి ఇచ్చిందన్నారు. ఇది 500 మీటర్ల బఫర్‌ను తప్పనిసరి చేసే ప్రభుత్వ నిబంధనకు విరుద్ధమన్నారు. ఇలాంటి గొడౌన్లకు ప్రభుత్వ భూమిని కేటాయించడం పర్యావరణ నిబంధనలు అతిక్రమించడమేనని ఆరోపించారు. ఇప్పటికైనా విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ యాజమాన్యం స్పందించి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చిన్నారావు, మురళి, రామ్మోహన్, పండా పాల్గొన్నారు.


మేయర్, జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గుడివాడ లతీష్,సభ్యులు

- జీవీఎంసీ 71వ వార్డులో ఏపీఐఐసీ అభివృద్ధి చేసి ఆటోనగర్ హౌసింగ్ కాలనీలో ఖాళీగా ఉన్న స్థలాలను జీవీఎంసీ స్వాధీనం చేసుకోవాలని ఆటో నగర్ హౌసింగ్ కాలనీ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.బ్రహ్మాజీరావు కోరారు. ఈ మేరకు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు.

తవ్వి .. వదిలేశారు!


వికాస్‌నగర్ ప్రాంతంలో పవర్ కేబుల్ పనుల కోసం తీసిన గోతులు


పనులు ప్రారంభించకుండా రోడ్డు పై ఉంచిన పవర్ కేబుల్

పెదగంట్యాడ: అండర్ గ్రౌండ్ పవర్ కే బుల్ అంటూ రోడ్లన్నీ తవ్వి వదిలేస్తున్నారు. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాష్ నగర్ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ కేబుల్ వర్కు పేరుతో 15 రోజుల కిందట రోడ్డును తవ్వి వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తీసిన మట్టి కరిగి రోడ్లపై చేరడంతో ఇబ్బందికరంగా అయింది. వికాష్‌నగర్ కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు తీసేందుకు వీలు లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేపట్టనప్పుడు ఎందుకు గోతులు తీశారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై గాజువాక జోనల్‌కమిషనర్‌కి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రోజులు తరబడి పనులు చేపట్టకుండా తవ్వి వదిలేస్తే తాము పలు ఇబ్బందులకు గురవుతున్నామని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తి చేసి గోతులు పూడ్చాలని కోరుతున్నారు.

గోతులు పూడ్చించాలి

జీవీఎంసీ, విద్యుత్ అధికారులు అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ వేయడానికి రోడ్ల తవ్వి 15 రోజులు గడుస్తున్నా.. పనులు చేపట్టలేదు..పనులు చేయనప్పుడు గోతులు ఎందుకు తీశారు. స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వెంటనే పనులు పూర్తి చేసి గోతులు పూడ్చించాలి.

–పి. లక్ష్మణ్‌రెడ్డి,వికాష్‌నగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి,

ఈవోఐలను తక్షణం రద్దు చేయాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన ఈవోఐలను తక్షణమే రద్దు చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వీటికి వ్యతిరేకంగా సోమవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుమతితోనే ఉక్కు యాజమాన్యం ప్లాంట్‌లోని 32 విభాగాల్లో 44 ఈవోఐలను ప్రకటించిందన్నారు. ఈ చర్య ప్లాంట్‌ను పూర్తిగా ప్రైవేటీకరించడమేనన్నారు. కూటమి ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పిన ప్యాకేజీలో భాగంగా ఇప్పటికే కాంట్రాక్ట్ కార్మికులను పెద్ద ఎత్తున తొలగించారన్నారు. ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్లాంట్ భూముల్ని ఎన్ఎండీసీకి ఇచ్చినప్పటికీ వారి నుంచి కాకుండా ఖుద్రేముఖ్ ఐరన్ ఓర్ నుంచి పెల్లెట్లు ఎందుకు కొంటున్నారని ప్రశ్నించారు. ఈ సమస్య రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టిలో ఉన్నప్పటికీ వారు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు రమణమూర్తి, యు.రామస్వామి, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, పి.శ్రీనివాసరాజు, గంగాధర్ పాల్గొన్నారు.


ధర్నాలో ప్రసంగిస్తున్న నాయకులు

చెరువుల్లా రోడ్లు


వడ్లపూడి రహదారి గుంతల్లో చేరిన నీరు

కూర్మన్నపాలెం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూర్మన్నపాలెం లోని పలుప్రాంతాలు బురదమయమై చిత్తడి చిత్తడిగా తయారయ్యాయి. ప్రధానంగా రోడ్లన్నీ గోతులుగా మారి ఎక్కడికక్కడ వర్షపునీరు నిలిచి పోయి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు నానాఅవస్థలు పడ్డారు. ముఖ్యంగా జాతీయరహదారి నుంచి కణితికాలనీకి వెళ్లే ప్రధాన రహదారి మరీ దారుణంగా తయారయింది. హైవే ఆరంభంలోనే పెద్ద పెద్ద గోతులు ఉన్నాయి. ఆ గోతుల్లో నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. దీని వల్ల వాహనచోదకులు పడుతూ లేస్తూ ప్రయాణం చేస్తున్నారు. ఆటోలాంటి చిన్న వాహనాలు గోతుల్లో దిగబడిపోతున్నాయి. వాటిని పైకి తీయడానికి ఆ వాహనాల యజమానులు అష్టకష్టాలు పడుతున్నారు. దీనికి తోడు ఇటీవల పైపులైను పేరుతో తవ్విన తవ్వకాలను తిరిగి పూడ్చడంలో అధికారులు అలసత్వం చూపారు. తూతూ మంత్రంగా మట్టి వేసి అలాగే వదిలేశారు. వర్షాలకు ఆమట్టి కూరుకుపోవడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీని వల్ల ఆ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ప్రజలు హడలిపోతున్నారు. 87వ వార్డు కార్పొరేటర్ ఇంటిముందు పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఏకంగా ఆటో కూరుకుపోవడం గమనార్హం. కూర్మన్నపాలెం నుంచి దువ్వాడ వెళ్లే ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలిచిపోయింది. లోతట్టు కాలనీల రోడ్లు బురదగా మారడంతో వాటిపై ప్రయాణం చేసేవారు జారి పడిపోతున్నారు.

ఇబ్బందులు పడ్డ ప్రజలు


కార్పొరేటర్ ఇంటిముందు రోడ్డులో దిగబడిన ఆటో

గంగవరం రోడ్డు కోత

పెదగంట్యాడ: పెదగంట్యాడ నుంచి గంవరం వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డులో వర్షపునీరు నిలిచిపోయింది. ఆ సమయంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు మొత్తం ఛిద్రమైంది. దీంతో గంగవరం గ్రామానికి చెందిన పలువురు సోమవారం ఆందోళనకు దిగారు. రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు నిషేధించాలని డిమాండ్ చేశారు. వెంటనే రోడ్డు నిర్మించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


కోతకు గురైన గంగవరం రోడ్డు



అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం


తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేప చేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు సోమవారం 25వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

నేడు అష్టదళ పద్మారాధన..
కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి

జగదాంబ: వర్షాల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ జోన్–4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం ఆయన జోన్ పరిధిలో 12 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాల్లో మురుగు నీరు అధికంగా ప్రవహిస్తున్న వీధులను పరిశీలించారు. కాలువల్లో చెత్తను పారిశుధ్య కార్మికులతో తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వీధుల్లో మురుగు నీరు, బురద చేరి దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. బ్లీచింగ్, ఫినాయిల్ జల్లాలన్నారు. ఎక్కడా చెత్త కుప్పలు లేకుండా శుభ్రం చేయాలన్నారు. తుపాను నియంత్రణ గది ఏర్పాటు చేశామన్నారు. అలాగే 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సెక్రటరీలు ప్రజలకు అవగాహన కల్పించి పాతభవనాల్లో నుంచి బయటికి తీసుకొచ్చి జీవీఎంసీ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.


పాత కట్టడంలో నివసిస్తున్న వారికి జాగ్రత్తలు చెబుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు